క్లుప్తంగా

ఎవరెక్స్ పరిశ్రమలో ప్రమాదంపై విచారణ



ఎవరెక్స్ పరిశ్రమలో ప్రమాదంపై వివరాలు సేకరిస్తున్న సీఐ నరసింగరావు

రాంబిల్లి(యలమంచిలి): లాలం కోడూరులోని ఎస్ఈజెడ్‌లో ఉన్న ఎవరెక్స్ డ్రగ్స్ పరిశ్రమలో శనివారం జరిగిన ప్రమాదంపై రాంబిల్లి సీఐ సిహెచ్.నరసింగరావు ఆదివారం విచారణ చేపట్టారు. పరిశ్రమలోకి వెళ్లి ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు పరిశ్రమ యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమ లోపల బాయిలర్ వద్ద రసాయనాలు మిక్సింగ్ చేస్తుండగా ప్రమాదం జరిగిందా? మరే ఇతర కారణాలు వల్ల జరిగిందా? అని ఆరా తీశారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి



తిమ్మరాజుపేటలో పిల్లలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

మునగపాక: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.అన్నపూర్ణ, షేక్ మిరాబీ ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా తిమ్మరాజుపేటలో ఆదివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కాండ్రేగుల సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

మూలపేట గ్రామాభివృద్ధికి కృషి



దీపాలను బాగు చేయిస్తున్న సర్పంచ్

మునగపాక: మూలపేట గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ బీశెట్టి గంగప్పల నాయుడు అన్నారు. గ్రామంలో మరమ్మతులకు గురైన వీధి దీపాల స్థానంలో ఆదివారం కొత్తవి అమర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై పాలకవర్గం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. గ్రామస్తులు కూడా గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు.

గాయపడిన భవన నిర్మాణ కార్మికులకు సాయం



కార్మికుడికి సహాయం అందిస్తున్న సంఘం సభ్యులు

అచ్యుతాపురం రూరల్ : గాయపడిన భవన నిర్మాణ కార్మికులు కంటిపాము అప్పారావు, ప్రకృతి కన్నయ్యకు శ్రీమణికంఠ భవన నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ) సభ్యులు ఆదివారం రూ.6 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్మికులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సంఘం అధ్యక్షులు రాజాన అప్పలనాయుడు, సభ్యులు పైడిరాజు, రాజు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము, మండల కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు, శివాజీ పాల్గొన్నారు.

కేవీ పురంలో పారిశుధ్య డ్రైవ్



కె.వెంకటాపురంలో డ్రైనేజీలో పూడిక తీస్తున్న కార్మికుడు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో ఆదివారం పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు వీధులను శుభ్రపరిచి డ్రైనేజీలలో పూడిక తీశారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ స్వచ్ఛ గ్రామం కోసం ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు ఇళ్లు, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. వారంలో ఒకరోజు డ్రైడే పాటించాలన్నారు.

సాయి సేవలో.. అన్నసమారాధన



ధారపాలెం సాయిబాబా మందిరంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

- ధారపాలెం సాయిబాబా ఆలయంలో ప్రతి గురువారం అన్నదానం
- దాతల సాయంతో ఆలయ కమిటీ సభ్యులు కొన్నాళ్లుగా నిర్వహణ



ధారపాలెం సాయిబాబా మందిరంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న నిర్వాహకులు

రాంబిల్లి(యలమంచిలి): అన్నార్తులు, వృద్ధుల ఆకలి తీరుస్తున్నారు ధారపాలెం షిర్డీసాయి మందిరం ఆలయ కమిటీ సభ్యులు. ప్రతి గురువారం ఇక్కడ షిర్డీసాయి మందిరంలో 50 నుంచి 70 మంది వరకు అన్నదానం చేస్తున్నారు. షిర్డీసాయి మందిరానికి విరాళాలు ఇచ్చిన దాతల పేరు మీద ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం ధారపాలెంలో కొలువైన ఉమాధర్మలింగేశ్వరుని ఆలయానికి సమీపంలో ఉన్న షిర్డీసాయి మందిరానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి దర్శించుకుంటారు. సాయిబాబా మందిర వార్షికోత్సవం, గురుపౌర్ణమి, కార్తీక పౌర్ణమి, తదితర పర్వదినాల్లో ఇక్కడ భారీగా అన్నసమారాధన నిర్వహిస్తుంటారు. ప్రస్తుతం సాయిబాబా మందిరంలో ప్రతి గురువారం ఇక్కడ దాతల సహాయంతో ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నారు. ఇందు కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు తమ పిల్లల పుట్టిన రోజు, కొంత మంది పెళ్లి రోజులు, తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అన్నదానం కోసం విరాళాలు అందిస్తున్నారు. పంచదార్ల, ధారపాలెంలో వెలసియున్న ఉమాధర్మలింగేశ్వరుని దర్శనానికి వచ్చిన భక్తులు తప్పకుండా ఇక్కడ ఉన్న షిర్డీసాయి మందిరాన్ని సందర్శిస్తుంటారు. ఇలా దాతల సహాయంతో నిర్వాహకులు భక్తులకు, వృద్ధులకు ఉచిత అన్నప్రసాదాలు అందజేస్తున్నారు. పులిహోర, అన్నం, ఒక కూర, సాంబారుతో నాణ్యమైన భోజనం పెడుతున్నారు. విరాళాలు పెరిగితే నిత్యాన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుడతామని కమిటీ సభ్యులు తెలిపారు.

వృద్ధులకు భోజనం పెట్టడం బాగుంది



ధారపాలెం షిర్డీసాయి మందిరంలో ప్రతి గురువారం ఉచితంగా అన్నదానం చేస్తున్నారు. నాలాంటి వృద్ధులు బాబా ఆశీస్సులతో అన్నప్రసాదం తింటున్నారు. ఆహార పదార్థాలు చాలా బాగుంటున్నాయి. ఇటువంటి కార్యక్రమానికి దాతల సహకారం అవసరం.

– మిడతాన పెంటయ్య, భోగాపురం

ప్రతి గురువారం వంట సేవ చేస్తున్నా..



ప్రతి గురువారం యలమంచిలి నుంచి ఇక్కడ బాబా సేవకు వచ్చి వంటలు చేయడానికి సహాయం చేస్తున్నాను. భక్తులకు దగ్గర ఉండి వడ్డిస్తాను. సాయంత్రం వరకు బాబా సన్నిధిలో ఉండి వెళ్తాను. ప్రతి గురువారం భక్తులు బాబా వారి అన్నప్రసాదానికి ఆసక్తిగా తరలివస్తుంటారు.

– చండక భాగ్యలక్ష్మి

దాతల సహాయంతో అన్నదానం



ధారపాలెంలో షిర్డీసాయి మందిరంలో ప్రతి గురువారం దాతలు అందిస్తున్న ఆర్థిక సహాయంతో భక్తులకు అన్నప్రసాదాలు అందజేస్తున్నాం. ప్రస్తుతం ప్రతి గురువారం 50 నుంచి 70 మంది వరకు అన్నదానం చేస్తున్నాం. విశిష్ట పర్వదినాల్లో ఎక్కువ మందికి అన్నప్రసాదం అందిస్తున్నాం.

– తులగాపు లలిత, ఆలయ కమిటీ సభ్యురాలు

వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ



శ్రీనివాసరావును పరామర్శిస్తున్న చిక్కాల

పాయకరావుపేట: వి.కొత్తూరు గ్రామం ప్రాథమిక పాఠశాల కమిటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బావరపు శ్రీనివాస్ తల్లి ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు ఆయనను జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తిరుమల రాజు, నరసింహరాజు, మాజీ డైరెక్టర్ బగ్గ బాబ్జి, ఎంపీటీసీ పులగల రాంబాబు, నీలాపు మహేష్‌రెడ్డి, పల్లెల వెంకట్, యజ్జల సత్యనారాయణ, నీలాపు చిరంజీవి రెడ్డి, బోడపాటి గోవిందు, పులగల భద్రరావు, అప్పారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగులు

కోటవురట్ల: పందూరు శివారు ములగలలోవలో రామాలయ నిర్మాణానికి ఆదివారం మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో ఆలయాలు మానసిక ప్రశాంతతను ఇస్తాయన్నారు. గ్రామైక్యతకు ఆలయాలు తార్కాణంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు సిద్ధాబత్తుల సత్యనారాయణ, సర్పంచ్ చీకట్ల జగదీష్, మాజీ ఎంపీటీసీలు కొమారు రమణ, చీకట్ల బాస్కరరావు, టీడీపీ జిల్లా కార్యదర్శి లాలం కాశీనాయుడు, మాజీ సర్పంచ్ గెంజి వెంకటరమణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మరక్షణ



గ్రేడింగ్‌లో బెల్ట్‌లు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

యలమంచిలి రూరల్: మార్షల్ ఆర్ట్స్ జీవితంలో అత్యవసర సమయాల్లో ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని షాటో కాన్ ఇండియా కరాటే జూడో అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ చీఫ్ బోధకుడు పి.నరసింహారావు అన్నారు. ఆదివారం స్థానిక వాగ్దేవి జూనియర్ కళాశాలలో యలమంచిలి మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ సీనియర్ కరాటే మాస్టర్ నక్కా వెంకటరమణ రంగా ఆధ్వర్యంలో సెమినార్, బెల్ట్ గ్రేడింగ్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇండియా కరాటే అసోసియేషన్ ఏపీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ జి.శివరామకృష్ణ హాజరయ్యారు. విద్యార్థినీ, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా కరాటే బెల్ట్ గ్రేడింగ్‌లో పాల్గొని విజయం సాధించారు. అనంతరం అర్హత సాధించిన వారికి బెల్ట్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నక్కా శివ శంకర్‌రావు, అడపా శేషగిరిరావు, దాడి రమేష్, పి.పథ్వీరాజ్, పి.రమేష్, కె.శ్రీను, కేవీ శ్యామ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఎండిన చెట్టు



ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఎండిన చెట్టు

ఎస్.రాయవరం: తిమ్మాపురం శివారు రేవుపోలవరం ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఆనుకుని ఎండిన చెట్టు ప్రమాదకరంగా తయారైంది. ఈ ప్రాంతంలో పలు వ్యాపార దుకాణాలు ఉన్నాయి. నిత్యం వందల సంఖ్యలో వినియోగదారులు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటోంది. ఇలాంటి ప్రదేశంలో ఎండిన భారీ వృక్షం అకస్మాత్తుగా కూలితే పెద్ద ప్రమాదం తప్పదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారుల పరిశీలించి వీలైనంత త్వరగా ఎండిన చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

‘బ్రాండిక్స్‌లో శ్రమ దోపిడీ’



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం రూరల్ : అచ్యుతాపురం బ్రాండిక్స్(అదిస్తాన్) పరిశ్రమ కార్మికులకు యాజమాన్యం తీవ్ర అన్యాయం చేస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము ఆరోపించారు. ఈఎస్ఐ, పీఎఫ్, రవాణా చార్జీలు పోను కార్మికులకు రూ.15వేలు తక్కువ కాకుండా వేతనమివ్వాలని ఆదివారం ఆయన డిమాండ్ చేశారు. నిత్యావసర ధరలు నానాటికీ పెరుగుతున్న తరుణంలో, యాజమాన్యం కోట్లాది రూపాయలు లాభాలు ఆర్జిస్తూ కార్మికులకు భిక్ష వేసుందన్నారు. కార్మికుల జీతాలు పెంచకుండా యాజమాన్యం శ్రమ దోపిడీ చేస్తుందన్నారు. కార్మికుల మెరుపు సమ్మె సమయంలో వేతనాలు పెంచి, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని యాజమాన్యం ప్రతినిధులు హామీ ఇచ్చి మాట తప్పారని ఆయన ధ్వజమెత్తారు. ప్రభుత్వ రాయితీలు పొందిన పరిశ్రమ యాజమాన్యం, పని చేసే కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. కార్మికులకు జీతాలు పెంచి న్యాయం చేయకపోతే, మెరుపు సమ్మెకు దిగుతామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు.

లారీకి రూ.60 వేల జరిమానా

అనకాపల్లి: మండలంలో మార్టూరు, బవులవాడ, మామిడిపాలెం గ్రామాల నుంచి రాంబిల్లి మండలానికి అధిక లోడుతో వెళ్తున్న లారీలపై ట్రాఫిక్ పోలీసులు ఆదివారం కఠిన చర్యలకు దిగారు. విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద బవులవాడ నుంచి రాంబిల్లికి అధిక లోడుతో వెళ్తున్న లారీని సీజ్ చేసి రూ.60 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ తెలిపారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి



పట్టుబడిన పందెంరాయిళ్లతో ఎస్ఐ రమేష్, పోలీసులు

కోటవురట్ల: కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కోటవురట్ల శివారు గవరపేటలో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారంతో ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పందేలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 3 కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. తీర్థాలు పురస్కరించుకుని కోడి పందేలు ఆడితే చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

విద్యతోనే మహిళలకు భవిష్యత్తు



బాలికలకు అవగాహన కల్పిస్తున్న అనకాపల్లి 10వ అదనపు జిల్లా కోర్టు జడ్జి శ్రీవిద్య

కశింకోట: బాలికలు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సాధించడానికి కృషి చేయాలని అనకాపల్లి 10వ అదనపు జిల్లా కోర్టు జడ్జి శ్రీవిద్య కోరారు. తాళ్లపాలెం ఏపీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం బాలికలకు చట్టాలు, కెరీర్ అభివృద్ధి, ఇతర అంశాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళల భవిష్యత్తుకు విద్య ప్రధానంగా దోహదపడుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో దీటుగా రాణిస్తున్నారని చెప్పారు. పోక్సో, ఇతర మహిళా రక్షణ చట్టాల గురించి, గుడ్, బ్యాడ్ టచ్‌ల పట్ల అవగాహన కల్పించారు. సమాజంలో మహిళలు ఎలా మసలుకోవాలి, అపరిచితుల నుంచి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి. గ్రేస్, ఎస్ఐలు లక్ష్మణరావు, మనోజ్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ మాస దీక్షలు ప్రారంభం



కశింకోటలోని నూరి మసీదులో రంజాన్ మాస ప్రారంభ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కశింకోట: కశింకోటలో ముస్లింలు పవిత్ర రంజాన్ మాస దీక్షలు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం స్థానిక జామియా, నూరి మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఉపవాస దీక్షను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. పిల్లలు మొదలుకొని పెద్దల వరకు దీక్ష ఉత్సాహంగా నిర్వహించారు. సాయంత్రం వరకు ఉపవాసం చేసి సంప్రదాయంగా దీక్ష విరమించారు. అనంతరం ఇఫ్తార్ విందు చేశారు. ఈ నెలాఖరు వరకు రంజాన్ దీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా మసీదులను విద్యుద్దీపాలతో అలంకరించారు. నూరి మసీదు కమిటీ అధ్యక్షుడు ఎస్.కె.రెహ్మతుల్లా, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ఎం అలీ, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని నరసింగబిల్లిలో కూడా ముస్లింలు ఉపవాస దీక్షలు చేపట్టారు. అక్కడి మసీదులో రంజాన్ మాస ప్రారంభ ప్రార్థనలు చేశారు.

ఘనంగా విశాలాక్షి కాశీవిశ్వేశ్వరుల కల్యాణం



విశాలాక్షి కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితుడు శర్మ, భక్తులు



అన్నసమారాధన ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: స్థానిక లింగరాయి గుడిలో ఆదివారం విశాలాక్షి కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. మహా శివరాత్రి పర్వదిన వేడుకల్లో భాగంగా వేద పండితుడు సోమశేఖరశర్మ మంత్రోచ్ఛారణల మధ్య కల్యాణం కమనీయంగా సాగింది. స్వామిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కోనపల్లి రామ్మోహనరావు, పిన్నమరాజు రవీంద్రరాజు, ఆడారి కాశీబాబు, సూరిశెట్టి రాము, కొయిలాడ గణేష్, కాండ్రేగుల జగన్, ఆడారి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలని వినతి



వీఆర్వోల సంఘం ఉపాధ్యక్షుడు శంకరరావుకు వినతిపత్రం అందిస్తున్న వీఆర్వోలు

మునగపాక: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం వీఆర్వో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకరరావుకు స్థానిక వీఆర్వోలు వినతిపత్రం అందజేశారు. వీఆర్వోలకు గ్రేడ్–1, వీఆర్వో గ్రేడ్–2లకు కామన్ డీడీవోగా నియమించేలా చూడాలని, సచివాలయానికి ఒక వీఆర్వోను నియమించాలన్నారు. పలు పనులకు సంబంధించి తీవ్ర ఒత్తిడితో ఉద్యోగం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రోగాల బారిన పడుతున్నామని వాపోయారు. ఇందుకు స్పందించిన శంకరరావు మాట్లాడుతూ వీఆర్వోల సమస్యలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు కె.రమేష్, బీవీ సత్యనారాయణ, ఈఎస్ఎస్ అప్పారావు, పి.హిమబిందు, సురేష్, అశోక్, మురళి, దేవి, జయకృష్ణ, కోటి, కన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళాలు



రూ.2లక్షల విరాళ చెక్కు అందిస్తున్న వాసు

మునగపాక: మునగపాకలో తలపెట్టిన వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి పలువురు భక్తులు తమ వంతు సాయం అందజేస్తున్నారు. ఉమ్మలాడకు చెందిన వ్యాపారవేత్త మొల్లేటి వాసు రూ.2 లక్షల చెక్కును ఆలయ కమిటీ చైర్మన్ ప్రసాద్‌కు ఆదివారం అందజేశారు. అనకాపల్లికి చెందిన బుద్ద పూర్ణమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారులు జగన్నాథరావు, రాజా రూ.10వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ అందరి భాగస్వామ్యంతోనే ఆలయ నిర్మాణం వేగవంతం అవుతుందన్నారు. దాతలు సహకరించి ఆలయ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దాడి మునిలినాయుడు, కాండ్రేగుల జగ్గారావు, బొడ్డేడ రామునాయుడు, ఆడారి లక్ష్మణరావు, మళ్ల కృష్ణ, మొతికా మల్లికార్జునరావు, వెలగా రామకృష్ణ, ఉప్పులూరి నాయుడు, సూరిశెట్టి శ్రీనివాసరావు, సూరిశెట్టి రామకృష్ణ, పాల్గొన్నారు..

మాదిగ అమరవీరులకు ఘన నివాళి



మాదిగ అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు

కోటవురట్ల: స్థానిక విజ్ఞాన్ సమత ఆవరణలో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూ జగ్జీవన్‌రామ్ యూత్ క్లబ్, ఎమ్మార్పీఎస్ నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టి, మాదిగ అమరవీరులకు నివాళులర్పించారు. దివంగత పెదపూడి బాబ్జీ, పెద్దాడ ప్రకాష్ సేవలు మరువలేనివని, మాదిగలలో చైతన్యం కలిగిస్తూ అనేక కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేశారు. వారి ఆశయ సాధనకు మాదిగలంతా ఐక్యంగా పని చేస్తారని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంటే అప్పారావు, యూత్ సభ్యులు కోడి కొండలరావు, పెదపూడి చంటి, గోరింట్ల అప్పారావు, మునగాడ పరుశురాం, గంటేడ చిరంజీవి, నరేంద్ర, కాండ్రకోట ననేష్, గంటేడ రమణ, కుమార్ పాల్గొన్నారు.

శాంతి రథం ప్రారంభం



శాంతి రథం ప్రారంభిస్తున్న సీఐ రామకృష్ణ

ఎస్.రాయవరం: అంత్యక్రియల కోసం మానవతా స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన శాంతి రథం, ఫ్రీజర్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని అడ్డురోడ్డు సీఐ లోడు రామకృష్ణ అన్నారు. అడ్డురోడ్డు కేంద్రంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సమకూర్చిన శాంతిరథం, మృతదేహాన్ని భద్రపరిచే ఫ్రీజర్ బాక్స్‌లను ఆయన ప్రారంభించారు. పట్టణ ప్రాంతాల్లో ఉండే ఇటువంటి సదుపాయాలను గ్రామాల్లో అందుబాటులోకి తీసుకురావడంపై సంస్థ సభ్యులను సీఐ అభినందించారు. ఈ సేవలు అడ్డురోడ్డు పరిసర ప్రాంతాలతో పాటు ఎస్.రాయవరం, నక్కపల్లి, కోటవురట్ల మండలాల ప్రజలు కూడా ఉపయోగించుకోవచ్చని సంస్థ సభ్యుడు ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి, అడ్డురోడ్డు శాఖ అధ్యక్షుడు యేజర్ల, గౌరవాధ్యక్షుడు వెంకటవరాహనరసింహారాజు, తదితరులు పాల్గొన్నారు.

11న గొర్రెలు, మేకల పెంపకందారుల ధర్నా



ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కోన లక్ష్మణ్

అనకాపల్లి: గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమానికి రూ.2500 కోట్లు రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న గుంటూరులో సహకార ఫెడరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ్ తెలిపారు. ఈ మేరకు మండలంలో మూలపేట గ్రామంలో ఆదివారం ధర్నా వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, మాంసం ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తూ ప్రజలకు పౌష్టికాహారాన్ని అందించడంలో నిరంతరం గొర్రెలు, మేకల పెంపకందారులు శ్రమిస్తున్నారని, వీటిపై జిల్లా వ్యాప్తంగా 5 లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నట్లు చెప్పారు. తరతరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో గొర్రెలు, మేకలు పెంపకందారులు అన్ని రకాలుగా వివక్షకు గురౌవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగినంత వైద్య సౌకర్యాలు కల్పించకపోవడంతో జన్మించిన 100 గొర్రె పిల్లల్లో 20 నుంచి 30 శాతం మృత్యువాత పడుతున్నట్లు ఆయన చెప్పారు. పశుసంవర్ధక శాఖ అధికారులు సకాలంలో వైద్య సౌకర్యాల కల్పనలో విఫలమవుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఈగల అప్పారావు, ఉప్పిలి ఆదినారాయణ, కడుపుట్టల అప్పారావు, అయితా రమణ, నూక అప్పారావు, సీహెచ్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.